## క్లుప్తంగా

### నేడు బాచుపల్లిలో ఊరూరా చెరువుల పండగ

నిజాంపేట్: బాచుపల్లిలోని బైరుని చెరువు వద్ద గురువారం ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌లు హాజరవుతారని, రైతులు, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేయర్ కోరారు.

### సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

జగద్గిరిగుట్ట: సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి సహకరించాలని జగద్గిరిగుట్ట సబ్‌స్టేషన్ ఏఈఈ రాధా కృష్ణారెడ్డి అన్నారు. ఇంటి వద్దే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈనెల 8న జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్పలోని 22వ బ్లాక్ వద్ద, 9న చింతల్‌లోని హనుమాన్ ఆలయం వద్ద, 10న అంజయ్యనగర్ కల్లు కంపౌండ్ వద్ద తమ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం 10గంటల నుంచి అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు.

### బీసీ కుల వృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం ప్రకటించిన బీసీ కుల, చేతివృత్తి దారులకు రూ.లక్ష ఆర్థిక సాయం కోసం అర్హులైన వారు ఈ నెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. ఈ దరఖాస్తులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్హులను ఎంపిక చేస్తారన్నారు.బీసీ కుల,చేతి వృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేసే కార్యక్రమాన్ని ఈ నెల 9 ముఖ్యమంత్రి కేసీఆర్ లాంచనంగా ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి కమలాకర్, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈనెల 9న సంక్షేమ సంబురాల సందర్భంగా రెండో విడత గొర్రెల పంపిణీ, ఇళ్ల పట్టాల పంపిణీ, బీసీ కుల వృత్తిదారులకు ఆర్థిక సాయం, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేపట్టాలని సూచించారు. ఈనెల 14న నిర్వహించనున్న వైద్య దినోత్సవాన్ని ఘనంగా జరపాలన్నారు. వైద్య విద్యార్థులను వేడుకలకు ఆహ్వానించాలన్నారు. వైద్యశాఖలో ప్రతి భకనబరిచిన అధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలకు అవార్డులు అందజేయాలన్నారు. వైద్య శాఖ మహిళా ఉద్యోగులకు చీరలు పంపిణీ చేయాలన్నారు.

### లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీని కాపాడటం దారుణం



నిజాంపేట్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీ బ్రిజేష్ భూషణ్‌సింగ్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లకు సంఘీభావంగా బుధవారం ప్రగతినగర్‌లోని జేఎన్‌టీయూ ఆటోస్టాండ్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీని కాపాడే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. నిరసనలో సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.శంకర్, ఆటో యూనియన్ అధ్యక్షుడు బాబునాయక్, ఉపాధ్యక్షుడు మహేష్‌రెడ్డి, నాయకులు సింగోటి, భాస్కర్, చాంద్, లతీఫ్, నర్సింహ, వరదారెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నాలా పనులు.. నిలిచిన మురుగు

- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- అనారోగ్యం బారిన పడుతున్న కౌశల్య కాలనీవాసులు
- ఔట్‌లెట్‌ను కలపకపోవడంతో పేరుకుపోయిన మురుగు
- నాలాపై శ్లాబ్ వేయాలని స్థానికుల డిమాండ్





కౌశల్య కాలనీ గుండా వెళ్తున్న ఎస్‌ఎన్‌డీపీ నాలాలో పేరుకుపోయిన మురుగు

నిజాంపేట్: ఎస్‌ఎన్‌డీపీ నాలా పనులతో ఆ కాలనీవాసులు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. ఆరు నెలలుగా నాలాలో మురుగు పేరుకుపోవడంతో తీవ్ర దుర్గంధాన్ని భరించలేక పోతున్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి 17వ వార్డులోని కౌశల్య కాలనీలో ఎస్‌ఎస్‌డీపీ నాలా పనులు 600 మీటర్ల మేర చేపట్టారు. అందులో భాగంగా భారీ గొయ్యి తీసి నాలా నిర్మాణం చేపట్టిన అధికారులు ఔట్‌లెట్‌ను కలిపే విషయంలో ముందుచూపు కొరడటంతో పది ఫీట్ల మేర నాలాలో మురుగు పేరుకుపోయింది. అది జనవాసాలకు పది ఫీట్ల దూరంలోనే నాలా వెళ్తుండటం, పైగా శ్లాబ్ లేకపోవడంతో ఎక్కడ మురుగునీటిలో తమ పిల్లలు పడతారోనని సమీప అపార్ట్‌మెంట్ వాసులు బెంబేలెత్తుతున్నారు.

**అధికారులు, కార్పొరేటర్‌కు విన్నవించినా..**

కౌశల్య కాలనీవాసులు కొన్ని నెలలుగా ఓపెన్ నాలాతో తాము పడుతున్న ఇబ్బందులను తొలగించాలని కార్పొరేషన్ అధికారులు, స్థానిక కార్పొరేటర్‌కు వినవించినా ఎటువంటి ప్రయోజనం లేదని వాపోతున్నారు. నాలాలో ఆరు నెలలుగా పేరుకుపోయిన మురుగు తీవ్ర దుర్వాసనలను వెదజల్లుతోంది. దోమలు బెడద పెరిగిపోవడంతో తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు.

**రోడ్లన్నీ బురదమయం.. నిలిచిన తాగునీరు..**

కౌశల్య కాలనీలో గుండా వెళ్తున్న నాలాకు ఔట్‌లెట్ ఏర్పాటు చేయకపోవడంతో తరచూ నాలా నిండి మురుగు రోడ్లపైకి వస్తున్నాయి. అంతే కాకుండా నాలా పనులతో కాలనీకి తాగునీటి సరఫరా సైతం నిలిచిపోయింది. అయితే ప్రతినెలా జలమండలి అధికారులు బిల్లులు పంపుతుండటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజల భద్రత, ఆరోగ్యం పట్టదా..**



ఎస్‌ఎస్‌డీపీ నాలాకు పైకప్పు లేకపోవడంతో ప్రమాదంగా మారింది. పది ఫీట్ల లోతున్న నాలాలో ఎక్కడ తమ చిన్నారులు పడతారోనని భయంగా ఉంది. నాలాలో మురుగు నీటి దుర్వాసనలతో ఇప్పటికే కాలనీకి చెందిన అనేక మంది శ్వాసకోశ వ్యాధుల బారినపడ్డారు. ఇక వర్షాలు ప్రారంభమైతే నాలా ఎక్కడుందో.. రోడ్డు ఎక్కడుందో తెలియని పరిస్థితి నెలకొంటోంది. ఈ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కలుగు చేసుకుని నాలాకు పైకప్పు ఏర్పాటు చేసి తమ సమస్యను తీర్చండి.

– శివప్రసాద్, కౌశల్య కాలనీ అధ్యక్షుడు

## 5 లక్షల బీసీ రుణాల దరఖాస్తులు ఏమయ్యాయి?

**మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్**



ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: దళిత బంధు పేరిట దళితులను మోసం చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీలను సైతం మోసం చేసేందుకు సిద్ధమయ్యారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. 'కుత్బుల్లాపూర్ గోస – శ్రీశైలం అన్న భరోసా'లో భాగంగా బుధవారం సూరారం డివిజన్‌లో పర్యటించారు. రాజీవ్ గాంధీనగర్, శివాలయనగర్ కాలనీల్లో స్థానిక నాయకులతో కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలను ఆయన తెలుసుకున్నారు.

◆ ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని సామాజికంగా విభజించి ఎన్నికల్లో లబ్ధి పొందాలని కేసీఆర్ చేస్తున్నారని విమర్శించారు. బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న 5లక్షల దరఖాస్తులు ఏమయ్యాయని ప్రశ్నించారు. గత తొమ్మిదేళ్లుగా దరఖాస్తు చేసకున్న పింఛన్లు, తెల్ల రేషన్‌కార్డులను వెంటనే జారీ చేయాలన్నారు. డివిజన్ అధ్యక్షుడు దుర్యోధన రావు, డివిజన్ ఇన్‌చార్జ్ రాజిరెడ్డి, నాయకులు చండి శ్రీనివాస్, బావిగడ్డ రవి, పత్తి రఘుపతి, కూన రఘుగౌడ్, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## వైఎస్సార్‌టీపీ విలీనం వార్తల్లో నిజం లేదు

**కుత్బుల్లాపూర్ కోఆర్డినేటర్ సురేష్‌రెడ్డి**

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీతో పొత్తు ఉన్నా కుత్బుల్లాపూర్ అసెంబ్లీ సీటు వైఎస్సార్‌టీపీదేనని ఆ పార్టీ అసెంబ్లీ కో.ఆర్డినేటర్ దేశిరెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో వైఎస్సార్‌టీపీ విలీనమవుతుందని వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. ఒక వేళ బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకుండా ఉండాలని పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిళ భావిస్తే కుత్బుల్లాపూర్ టికెట్ మాత్రం వైఎస్సార్‌టీపీకే దక్కుతుందన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అధికార పార్టీ ఎమ్మెల్యే ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. గతంలో వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్‌గృహకల్ప ఇల్లను కట్టించారని గుర్తు చేశారు. ప్రస్తుత కేసీఆర్ ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో కార్పొరేటర్లతో సమావేశాలు పెడుతూ హంగామా చేస్తున్నారని అన్నారు. జూన్ 10వ తేదీ నుంచి 'షర్మిళమ్మ ఆదేశం – సురేష్ అన్న బస్తీబాట'పేరుతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా బస్తీబాట చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సురేష్‌రెడ్డి కోరారు.

## 'కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి ఆదరణ లభిస్తోంది'



నర్సారెడ్డి భూపతిరెడ్డి కలిసిన రాజీవ్‌గృహకల్ప వాసులు

దుండిగల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్పవాసులు బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ సెల్ జాయింట్ కో–ఆర్డినేటర్ గడ్డమీది భరత్‌గౌడ్, సీనియర్ నాయకులు గుడే రాజశేఖర్, మహేశ్ నాయీ, యువరాజ్, లక్ష్మణ్, చంద్రశేఖర్, కోటేశ్వర్‌రావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



బీజేపీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానిస్తున్న కూన శ్రీశైలంగౌడ్

జగద్గిరిగుట్ట: నియోజకవర్గ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బుధవారం జగద్గిరిగుట్ట, బీరప్పనగర్ పార్టీ కార్యాలయంలో శివనగర్‌కు చెందిన పలువురికి బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జగద్గిరిగుట్టకు బస్ డిపో ఏర్పాటు చేస్తానని రెండు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రస్తుత ఎమ్మెల్యే నెరవేర్చలేదన్నారు. ఈనెల 14వ తేదీన గాజులరామారం చిత్తారమ్మ ఆలయ సమీపంలో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిచనున్నట్లు శ్రీశైలంగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో జేకే శేఖర్‌యాదవ్, సుధా, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సన్మానం



మర్రి లక్ష్మణ్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

దుండిగల్: నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఎంపికయ్యారు. ఇటీవల ఢిల్లీలోని కమల్‌సింగ్ స్టేడియంలో నిర్వహించిన ఎన్నికల్లో జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఐదుగురికి జాతీయ కార్యవర్గంలో చోటు దక్కింది. సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా భగవాన్, వైస్ ప్రెసిడెంట్‌గా ప్రభుకుమార్, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మి, లక్ష్మణ్‌రావు, ఢిల్లీ ప్రెసిడెంట్‌గా సురేశ్‌కుమార్ ఎన్నికయ్యారు. దుండిగల్‌లోని కళాశాలలో లక్ష్మణ్‌రెడ్డిని కళాశాల కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, వివిధ విభాగాల అధిపతులు శుభాకాంక్షలు తెలిపారు.

## టీకా కేంద్రాన్ని మోడల్ మార్కెట్‌లోకి మార్చండి

జగద్గిరిగుట్ట: టీకా కేంద్రాన్ని మోడల్ మార్కెట్‌లోకి మార్చాలని విద్యార్థి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. డివిజన్ పరిధిలోని సోమయ్యనగర్ మహిళా భవన్‌లో టీకా కేంద్రం కొనసాగుతోంది. బుధవారం విద్యార్థి జేఏసీ నాయకులు టీకా కేంద్రాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. పసి పిల్లల నెలవారి టీకాలు ఇప్పించేందుకు వచ్చే బాలింతలు ఇక్కడ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎండలోనే నిలబడాల్సి వస్తోందని తెలిపారు. కనీసం వసతలు లేక బాలింతలు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని తెలుపుతూ గతేడాది మేడ్చల్ జిల్లా డీఎంహెచ్ఓ, కూకట్‌పల్లి జెడ్‌సీకి టీకా కేంద్రాన్ని మోడల్ మార్కెట్‌లోకి మార్చాలని వినతి పత్రం ఇచ్చామని గుర్తు చేశారు. నేటికీ వారు టీకా కేంద్రం తరలింపుపై చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. డివిజన్‌లోని మోడల్ మార్కెట్‌లో గడిచిన 20 రోజులలో బస్తీ దావాఖానా, ఆర్‌ఆర్‌ఆర్, అతి త్వరలో వార్డు కార్యాలయం కూడా ప్రారంభించనున్నారు. ఇంకా మోడల్ మార్కెట్‌లో కొన్ని షటర్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సోమయ్యనగర్‌లో కొనసాగుతున్న టీకా కేంద్రాన్ని ఆ ఖాళీ షటర్లలోకి మార్చాలని డిమాండ్ చేశారు.

## ప్రైవేట్ కంపెనీల్లో రిజర్వేషన్లను అమలు చేస్తాం

**టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి**



కైసర్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

సుభాష్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రభుత్వ రాయితీలు పొందుతున్న ప్రైవేట్ కంపెనీల్లో రిజర్వేషన్లను అమలు చేస్తామని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా బుధవారం గాజులరామారం డివిజన్ పరిధి కైసర్‌నగర్‌లో పార్టీ జెండాను ఎగురవేసి స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంచిపెట్టారు.

◆ ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను నట్టేట ముంచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతితో పాటు ఉద్యోగవకాశాలను మెరుగు పరుస్తామన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాల మోసపూరిత హామీలను నమ్మొద్దని కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగెస్ నాయకులు జహంగీర్, జేమ్స్, సిద్దినోళ్ల సంజీవరెడ్డి, వెంకటేష్, షఫీ, గణేష్, శ్రీనివాస్‌గుప్తా, శారదా, రాధా తదితరులు ఉన్నారు.

## కనకయ్యగౌడ్ కుటుంబీకులకు పరామర్శ



కనకయ్య కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న కాంగ్రెస్ నేత భూపతిరెడ్డి

సుభాష్‌నగర్: పార్టీలో కష్టపడి పని చేసే కార్యకర్తకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ అయోధ్యనగర్ చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కనకయ్యగౌడ్ ఇటీవల మృతి చెందడంతో బుధవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కుటుంబ సభ్యులకు రూ.25వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కుటుంబ సభ్యులకు పార్టీ పరంగా అండగా ఉంటామని భూపతిరెడ్డి భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, దుర్గాప్రసాద్, రాధాకృష్ణ ఉన్నారు.

## డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌కు అభినందనలు

జీడిమెట్ల: అత్యవసర సమయంలో వచ్చి కాలనీలో సేవలు అందించిన డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్‌ఎఫ్) బృందాన్ని కాలనీవాసులు అభినందించారు. మంగళవారం సాయంత్రం జీడిమెట్లలో తీవ్రమైన గాలివానకు సుభాష్‌నగర్ డివిజన్‌లోని ఎస్‌ఆర్‌నాయక్‌నగర్‌లో చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు సైతం విరిగిపోయి రోడ్లపై పడ్డాయి. దీంతో ఎస్‌ఆర్ నాయక్‌నగర్, జనప్రియ అపార్ట్‌మెంట్, మోడీ బిల్డర్స్, దుర్గాకాలనీ ప్రాంతాల్లో విద్యుత్ నిలిచిపోయింది. విద్యుత్‌లో అంతరాయం ఏర్పడటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న డీసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సిబ్బంది కాలనీకి చేరుకున్నారు. అతి తక్కువ సమయంలోనే రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్లను తీసివేయడంతో పాటు విద్యుత్ స్తంభాలను పక్కకు వేశారు. దీంతో విద్యుత్ సిబ్బంది విద్యుత్‌ను పురరుద్ధరించేందుకు వీలుగా మారింది. కాలనీలో విద్యుత్ రావడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. డీఆర్‌ఎఫ్ బృందాన్ని కాలనీవాసులు అభినందించి వారికి ధన్యవాదాలు తెలిపారు.



## యువకుడు ఆత్మహత్యాయత్నం

జగద్గిరిగుట్ట: మద్యం మత్తులో ఓ యువకుడు చేతిపై బ్లేడుతో కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాపిరెడ్డి నగర్‌కు చెందిన దిలీప్(25) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో స్థానికంగా బట్టల షాపు నడుపుకుంటున్న పిన్ని దగ్గరకు వచ్చి తన అన్నకు ఫోన్ చేయమని చెప్పాడు. ఫోన్ స్విచ్ ఆఫ్ అయ్యిందని కాసేపు ఆగమని చెప్పింది. ఇంతలోనే తాను తెచ్చుకున్న బ్లేడుతో చేతిపై కోసుకున్నాడు. కాసేపట్లోనే కుప్పకూలిపోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. తరుచూ ఇలానే వచ్చి డబ్బులు ఇవ్వమని, ఇవ్వకుంటే బ్లేడుతో కోసుకుంటానని బ్లాక్‌మేయిల్ చేసేవాడని తన పిన్ని వివరణలో పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రాజకీయంగా ఎదుర్కోలేకనే నాపై ఆరోపణలు

**నిజాంపేట్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్**



ఆధారాలను చూపుతున్న రంగరాయ ప్రసాద్

నిజాంపేట్: రాజకీయంగా ఎదుర్కోలేకనే బీజేపీ నాయకులు తనపై ఆరోపణలు చేస్తున్నారని నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ అన్నారు. బుధవారం నిజాంపేట్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాచుపల్లిలోని సర్వే నం.453 సర్వేలోని భూమిని తాను శంకర్‌రెడ్డి అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేశానన్నారు. అప్పటికే ఆయన స్థలానికి సంబంధించి హెచ్‌ఎండీఏ నుంచి కన్‌స్ట్రక్షన్ అనుమతులు పొందారన్నారు. గతంలో హెచ్‌ఎండీఏ ఇచ్చిన స్థలానికే మరలా మార్చి 31న మరోసారి అనుమతి పొందామన్నారు. అందులో ఏ విధమైన ఆక్రమణలు జరగలేదని స్పష్టం చేశారు. తమ వద్ద అన్ని ధృవపత్రాలు ఉన్నాయని పేర్కొన్నారు.

**పెద్ద చెరువు బఫర్ జోన్ ఆక్రమణ: సతీష్, బీజేపీ అధ్యక్షుడు**

ఆకృతి కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం రోడ్డు కోసం పెద్ద చెరువు కట్టను ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు సతీష్ అన్నారు. హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో చెరువు బఫర్‌జోన్ 100 మీటర్లు వదిలినట్లు చూపించారని పేర్కొన్నారు. హెచ్‌ఎండీఏ పర్మిషన్‌లో 100 ఫీట్లు కూడా లేదన్నారు. చెరువు బఫర్ జోన్ కబ్జాకు పాల్పడుతున్న ఆకృతి కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# మిషన్ కాకతీయతో చెరువులకు మహర్దశ

**ఎమ్మెల్యే వివేకానంద్**



రైతు దినోత్సవంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: మిషన్ కాకతీయ పథకంతో రాష్ట్రంలోని చెరువులు, కుంటలకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. దుండిగల్ చెరువు వద్ద బుధవారం సాగునీటి దినోత్సవ వేడుకలను నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అంతకు ముందు కట్ట మైసమ్మతల్లికి, గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే సాగునీటి విజయాలపై.. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఏవీని రైతులతో కలిసి వీక్షించారు. అనంతరం నీటి ప్రవాహం, మా తెలంగాణ కోటి ఎకరాల మాగాణం పుస్తకాన్ని ఆవిష్కరించారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు చెరువుల అభివృద్ధిని పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరిస్తోందన్నారు. పూడికతీత పనులను పెద్ద ఎత్తున చేపట్టిందని తెలిపారు. చెరువు గ్రామ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక వికాసానికి దోహద పడుతుందన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం మనకు గర్వకారణమన్నారు.

**ఇప్పటి వరకు 29చెరువులను పునరుద్ధరించాం..**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం 91 చెరువులు ఉన్నాయని పేర్కొన్నారు. మిషన్ కాకతీయ ఫేజ్–1లో భాగంగా రూ.430.109 లక్షలతో 14 చెరువులు, కాకతీయ ఫేజ్–02లో రూ.216.86 లక్షలతో 10 చెరువులు, మిషన్‌కాకతీయ ఫేస్3లో రూ.57.55 లక్షలతో రెండు చెరువులు, మిషన్ కాకతీయ ఫేజ్–4లో రూ. 52.94 లక్షలతో 3 చెరువులను పునరుద్ధరించారని తెలిపారు. మొత్తం 29 చెరువులకు రూ.757.54 లక్షలు వెచ్చించామని పేర్కొన్నారు. అంతే కాకుండా ఫాక్స్ సాగర్, అంబీర్ చెరువుల కరకట్టలను పటిష్టతం చేయడంతో పాటు సుందీకరణకు రూ.67.85 కోట్ల ఖర్చు చేశామన్నారు.

**మిషన్ కాకతీయ తర్వాత చెరువుల నీటి సామర్థ్యం 327.34 ఎంసీఎఫ్‌టీలు**

◆ జీహెచ్‌ఎంసీ నిధులతో రూ.35.10 కోట్ల ఖర్చుతో చెరువుల నుంచి మురుగు నీటి మళ్లింపు, చెరువు కట్ట ఆధునీకరణ తూముల మరమ్మతు పనులు, ఫెన్సింగ్, సుందరీకరణ పనులు చేపట్టామని పేర్కొన్నారు. మిషన్ కాకతీయకు ముందు నియోజకవర్గ పరిధిలో చెరువుల నీటి నిల్వ సామర్థ్యం 286.12 ఎంసీఎఫ్‌టీ ఉండగా మిషన్ కాకతీయ తర్వాత చెరువుల సామర్థ్యం 327.34 ఎంసీఎఫ్‌టీలు పెరిగిందన్నారు. 2014 ముందు నియోజకవర్గ పరిధిలో ఆయకట్టు 1824 ఎకరాలు ఉంటే ప్రస్తుతం ఆయకట్టు 2073 ఎకరాలకు పెరిగిందన్నారు. ఫాక్స్ సాగర్, అంబీర్ చెరువులను మినీ ట్యాంక్ బండ్ లుగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

◆ ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ బస్సీలాల్, డీఈఈ సురేష్, ఏఈ సార, మున్సిపాలిటీ కమిషనర్ సత్యనారాయణ, తహసీల్దార్ పద్మప్రియ, డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్, మాజీ జెడ్పీవైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్ యాదవ్, కౌన్సిలర్లు జక్కుల కృష్ణాయాదవ్, గోపాల్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, కార్పొరేటర్లు విజయలక్ష్మి, బాలాజీ నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, డైరెక్టర్ శ్రీనివాస్, సింగిల్ విండో డైరెక్టర్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల గ్రామంలోని ఓ దుకాణం వద్ద బుధవారం ఓ వ్యక్తి పడి ఉన్నాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సదరు వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. అతనికి సంబంధించిన ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు. అనారోగ్య సమస్యలతో చనిపోయి ఉంటాండని, పోస్ట్ మార్టమ్ నివేదికలో విషయాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎంపీ బ్రిజ్ భూషణ్‌సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి



షాపూర్‌నగర్‌లో నిరసన ర్యాలీ చేపట్టిన సీఐటీయూ నాయకులు

రంగారెడ్డినగర్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీ బ్రిజ్ భూషణ్‌సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేసి న్యాయం చేయాలని సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ రైతుబజారు నుంచి సాగర్ హోటల్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. మహిళా రెజ్లర్లు తమపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేయాలని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్నా కేంద్ర ప్రభుత్వం దిగి రాకపోవడం సిగ్గు చేటన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్బంధాన్ని నిరసిస్తూ జూన్ 13న మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపడతామని స్పష్టం చేశారు. రెజర్ల పోరాటానికి కార్మిక లోకం అండగా ఉంటుందన్నారు. సీఐటీయూ నాయకులు సత్యం, అంజయ్య, దేవదానం, స్వాతి, మల్లారెడ్డి, శ్రీనివాస్, బాలయ్య, దుర్గా నాయక్ తదితరులు ఉన్నారు.